జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 12-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 614 పేజీలు: 4 వెల : రూ.7



* పరదేశిపాలెం పండగల్లో జోరుగా పిక్కాట * పందెంలో కాసి చేతులు కాల్చుకున్న యువత * పెద్దలు, పోలీసులకు డబ్బులు ఇచ్చి ఆడిస్తున్నామన్న నిర్వాహకులు

# కాయ్ రాజా కాయ్

**శ్రీకాకుళం క్రైం, మార్చి 11 (వార్త):** ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వండి, వెంటనే చర్యలు చేపడతామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇస్తున్న ఆదేశాలను కొందరు పోలీసులు బేఖాతర్ చేస్తున్నారు. కొందరు పోలీసులు కాసులకు కక్కుర్తి పడి చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం వల్ల ఆ శాఖకు మచ్చగా మారుతోంది.

శ్రీకాకుళం రూరల్ మండలంలోని పరదేశి పాలెంలో అసిరితల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు సందర్భంగా గ్రామంలో కొందరు జోరుగా కాయ్‌రాజా కాయ్ అంటూ పిక్కాటను నిర్వహిస్తున్నారు. పిక్కాట వేసిన వారు మాత్రం తాము ఉత్సవ నిర్వాహకులకు, పెద్దలకు, పోలీసులకు డబ్బులు ఇచ్చి నిర్వహిస్తున్నామని బహిరంగంగానే చెబుతున్నారు.

మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకూ ఇక్కడ పిక్కాట పెద్ద ఎత్తున సాగింది. పెద్ద ఎత్తున నగదును పందెంలో కాసి కొందరు చేతులు కాల్చుకున్నట్టు సమాచారం. ఎక్కువగా యువతే ఈ పిక్కాట ఆడి కాసులు కోల్పోయినట్టు స్థానికులు చెబుతున్నారు. పరదేశిపాలెం గ్రామస్థులే కాకుండా చుట్టుపక్కల గ్రామస్థులు ఈ ఉత్సవాలకు వచ్చి పిక్కాట ఆడి వేలల్లో నగదును పోగొట్టుకున్నారు. ఇకనైనా పోలీసులు స్పందించి ఇటువంటి జూద క్రీడలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## గంజాయి తాగుతూ.. పట్టుబడ్డారు

* ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎచ్చెర్ల పోలీసులు



**శ్రీకాకుళం క్రైం, మార్చి 11 (వార్త):** ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 2.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పొన్నాడ ఫ్యాక్టరీ రోడ్ వద్ద నలుగురు యువకులు గంజాయి తాగుతుండగా ఎచ్చెర్ల ఎస్ఐ లక్ష్మణరావుకి వచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఒకరు పారిపోగా, ముగ్గురు పట్టుబడ్డారు. వీరిలో పట్టుబడిన వారిలో గంటల సూర్య తేజ (26), బురిడి లైకోన్ ఏ దేవ్ (22), కేశవ బాలు (20) ఉన్నారు. అలాగే వీరి వాహనం డిక్కీని తనిఖీ చేయగా రెండు గోధుమరంగు ప్లాస్టిక్ ప్యాకెట్లు, కేశవ బాలు ప్యాంటు జేబులో ఉన్న పాలిథిన్ కవర్‌లో గంజాయి ప్యాకెట్ లభ్యమయ్యాయి. మొత్తం మూడు ప్యాకెట్ల 2.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు తరచూ ఆ ప్రదేశానికి వచ్చి గంజాయి తాగుతున్నట్టు తమ విచారణలో తేలిందని జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. అరకు ప్రాంతానికి చెందిన బురిడి లైకోన్ ఏ దేవ్ గంజాయిని కిలోకు రూ.3,000లకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. సోపెటీ కార్తీక్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, పరారైన వ్యక్తిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

జిల్లాలోని శ్రీకాకుళం పీఎన్ కాలనీ, ఆమదాలవలస, బొబ్బిలి, చీపురుపల్లి ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ నర్సింగరావు, ఆమదాలవలస మండలం తోటవాడకు చెందిన బెండి శివప్రసాద్ జైలు నుంచి గతేడాది సెప్టెంబరు 21న విడుదలయ్యారు. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో వీరు చోరీలకు పాల్పడ్డారు. బుధవారం శ్రీకాకుళం నగరంలోని బైరివానిపేట జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై వస్తుండగా టూటౌన్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా వీరిద్దరూ అనుమానాస్పదంగా ఉండడంతో పట్టుకుని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. దీంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్టు వీరిద్దరూ అంగీకరించారు. వీరి నుంచి వీరి నుంచి 71 గ్రాముల బంగారం, 11 తులాల వెండి రికవరీ చేశామన్నారు. వీరిపై శ్రీకాకుళంతో పాటు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ పట్నం జిల్లాల్లో కూడా పలు చోరీ కేసుల నమోదైనట్టు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

## రెండో రోజూ ఏసీబీ తనిఖీలు

**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో రెండో రోజు బుధవారం కూడా ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. మంగళవారం టౌన్‌ప్లానింగ్ విభాగంలో రికార్డులు పరిశీలించగా, బుధవారం క్షేత్రస్థాయిలో భవనాల నిర్మాణాలను పరిశీలించారు. జీటీ రోడ్డు, 80 అడుగుల రోడ్డు, పీఎన్ కాలనీ, న్యూకాలనీ, విశాఖ ఏ కాలనీ తదితర ప్రాంతాల్లో పలు భవనాలు, అపార్టుమెంట్లను పరిశీలించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన ప్లాన్‌కు అనుగుణంగా భవన నిర్మాణాలు జరిగాయా లేదా అనేది తనిఖీ చేశారు. గురువారం నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు సీఐలు భాస్కరరావు, రమణ తెలిపారు.



## గుడ్ మార్నింగ్ విత్ ఆమదాలవలస

* వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే * ప్రజలతో మమేకమవుతున్న కూన * ప్రజా సమస్యల పరిష్కారానికి రవికుమార్ కృషి * హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



**ఆముదాలవలస, మార్చి 11 (వార్త):** ఆమదాలవలస పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకొని నిర్వహిస్తున్న "గుడ్ మార్నింగ్ విత్ ఆముదాలవలస" కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవా రం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులను ప్రత్యక్షంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన ఉదయం నుంచే వార్డుల్లో తిరుగుతూ ప్రజ లను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు, తాగు నీటి సరఫరా, వీధి దీపాలు, పారిశు ధ్యం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు చెప్పిన సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికా రులకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటూ, పెద్ద సమస్యలకు తగిన ప్రణాళిక రూపొందించి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల మధ్యకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పాలన మరింత సమర్థవంతంగా అమలవుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే పట్టణంలోని పారిశుధ్య పరిస్థితులను కూడా పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వార్డులో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వా లని, చెత్త సేకరణను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డులలోని రోడ్లు, కాలు వలు, నీటి ట్యాంకులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల పరిస్థితిని కూడా ఎమ్మెల్యే సమీక్షించారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధా న్యతగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలి పారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించడంపై స్థానికులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌ని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సి పల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు నేడు వైద్య శిబిరం

**పలాస, మార్చి 11 (వార్త):** స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సఫాయి మిత్ర సురక్ష శివరిష్‌లో భాగంగా పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరం పలాస హరిజన వీధి అర్బన్ హెల్త్ సెంటర్, పాత కోర్టు వీధిలో నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు తెలిపారు. ఈ అవకాశాన్ని పారిశుధ్య కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.






# గ్యాస్ ధరల పెంపు దుర్మార్గం

**- సీపీఐ నేతలు**

**-నరసన్నపేటలో నిరసన**



**నరసన్నపేట, మార్చి 11(వార్త):** వంటగ్యాస్ ధరలను పెంచడం దుర్మార్గమని, పెరిగిన ధరల వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్, బొత్స సంతోష్ విమర్శించారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవా రం నరసన్నపేట మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మహిళలకు అత్యంత గౌరవం ఇస్తున్నామని చెప్పే ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ మహిళా దినోత్స వం రోజునే గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమని అన్నారు. ఇంటి వినియోగ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంచడం సరికాదని పేర్కొన్నారు.

ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమైందని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా లక్షల కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆయన విమర్శించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని వంటగ్యాస్‌ను రూ.500కే అందుబాటులోకి తేవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ నరసన్నపేట మండల కార్యదర్శి ఆర్. అరవింద్, సిపిఐ నాయకులు నెయ్యల నారాయణరావు, లవ కుమార్, భాస్కరరావు, లక్ష్మి, శ్యామ్, వసంతరావు, అచ్చెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి బాయి పూలేకు నివాళులు



**పలాస, మార్చి 11 (వార్త):** సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా ఓబీసీ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు లక్కోజు ధర్మారావు ఆధ్వర్యంలో ఆ పుణ్యమూర్తికి గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సమాజంలో స్త్రీల విద్య కోసం ఆమె చేసిన పోరాటం గురించి నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని లక్కోజు ధర్మారావు అన్నారు. మహిళల సాధికారత, విద్యా హక్కు కోసం ఆమె త్యాగాలు ప్రేరణ అన్నారు. ఆమె ఆశయాలను గ్రామీణ మహిళల అభివృద్ధికి అమలు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బూర్జిపేట హరి కృష్ణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పేరాడ యోగి, బద్రి హరికృష్ణ, సకలాబత్తుల షణ్ముఖరావు, చౌతా ధర్మారావు, హనుమంతు మురళీమోహన్ దొర తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్‌లో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు



**నరసన్నపేట, మార్చి 11(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ మూడవ వీధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు ఒకే చోట చేరిపోవడంతో పరిసర ప్రాంతాల్లో అస్వచ్ఛత పెరిగిందని వారు తెలిపారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అధికంగా పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా విషసర్పాలు కూడా సంచరిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇదే ప్రాంతంలో రహదారుల పరిస్థితి కూడా దయనీయంగా ఉందని, వర్షాకాలంలో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెప్పారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు వెంటనే దృష్టిసారించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి రహదారులను అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

## మండపల్లి పదో తరగతి పరీక్ష కేంద్రానికి బస్ సౌకర్యం కల్పించాలి



**ఇచ్ఛాపురం మార్చి 11 (వార్త):** మండపల్లి లో పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం మంజూరు కావడంతో ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు పలాస ఆర్టీసీ డిపో చిన్నారావు పరిశీలించారు. ఉన్నత అధికారులు దృష్టి కి తీసుకుని వెళ్లి బస్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వాసంతి, నరేంద్ర పట్నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టెన్నిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** శ్రీకాకుళం జిల్లా టెన్నిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపికైంది. సంఘం అధ్యక్షులుగా డాక్టర్ ఎస్‌వీఎస‌ఆర్‌కే నేతాజీ, ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఎం. వెంకట్రావు, కార్యదర్శిగా డాక్టర్ వి. విజయ కృష్ణ, జాయింట్ సెక్రటరీగా డబ్ల్యూ మణిబాబు, కోశాధికారిగా ఎస్. స్వామిబాబు ఎన్నికయ్యారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సంఘం కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ గేదెల విద్యా సాగర్, ఎం. సూర్య తేజ, ఈ. విజయ సాగర్, కె. శంకరరావును ఎంపిక చేసినట్టు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే నూతన కార్యవర్గానికి పలు క్రీడా సంఘాలు అభినందనలు తెలియజేశాయి.

## కూర్మ గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు

**నరసన్నపేట, మార్చి 11(వార్త):** జలుమూరు మండల శివారులో ఉన్న కూర్మ గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 27వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రభుదాసు తెలిపారు. మంగళవారం సాయంత్రం నరసన్నపేట పట్టణంలోని నేతాజీ వీధిలో భక్తులను కలుసుకునేందుకు వచ్చిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. శ్రీరామ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఈ నెల 26వ తేదీన ఇంజినీరింగ్ విద్యార్థులకు దీక్ష కంకణాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శ్రీరామ నవమి సందర్భంగా జరిగే ఈ కార్యక్రమాలకు భక్తులు తరలివచ్చి శ్రీరాముడి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**-శివసాగర్ బీచ్ లో చెత్తను సేకరించిన ఎమ్మెల్యే శిరీష**

**-స్వచ్ఛ సర్వేక్షణ్ లో భాగంగా స్వచ్ఛంద సేవ**



**పలాస, మార్చి 11 (వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ భాగంగా అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం చెత్త సేక రణ చేసి ఆదర్శంగా నిలిచారు. నాయకత్వం అంటే కేవలం ఆదేశించడం కాదు, ఆచరించి చూపడం అని ఆమె చాటారు. సముద్ర తీరాలను, పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని ఆమె చేతల్లో చూపించారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛమైన సమాజం కోసం అందరం అడుగులు ముందుకు వెయ్యాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, వజ్రపుకొత్తూరు మండల అధికారి రమేష్‌నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, గోరకల వసంతస్వామి, ఉమామహేశ్వరరావు, శశిభూషణ్, సింగుపల్లి బాలకృష్ణ, మల్లా శ్రీనివాసరావు, మారడ దుర్యోధన, కూటమి నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆందోళన వద్దు..అండగా ఉంటాం!

**-పెద్ద లక్ష్మీ పురం గ్రామస్తులకు వైస్సార్సీపీ నాయకుల భరోసా**

**ఇచ్ఛాపురం మార్చి 11 (వార్త):** బూర్జపాడు పంచాయతి పెద్ద లక్ష్మీపురం ప్రాంతంలో ఒడిస్సాకు చెందిన సర్వే అధికారులు ఆంధ్రప్రదేశ్ అధికారులు హాజరులో లేకుండా చేస్తున్న సర్వే పట్ల ఆందోళన చెందుతున్నందున వాస్తవ పరిశీలనకు ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పెద్ద లక్ష్మీపురం చేరుకొని ప్రజల ఆందోళనకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఒడిస్సా ప్రాజెక్టు డైరెక్టర్ సోమనాథ్ తో ఫోన్ లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో సర్వే చేయవలసిన అవసరం ఏర్పడినప్పుడు ఆంధ్రప్రదేశ్ అధికారుల ప్రమేయం లేకుండా సర్వేని ఎలా జరిపిస్తారు అని ప్రశ్నించారు. ఇది దురాక్రమణ కాదా? అని ప్రశ్నించారు. ఒక వేళ మీ ప్రాజెక్టు ప్రజా ప్రయోజనాలకు సంబందించినదే అయినప్పుడు చట్టబద్ధంగా ఆంధ్రప్రదేశ్, ఒడిషా సంయుక్త ఆద్వర్యంలో నిర్వహించుకోవడమే సమంజసం కదా? అని ప్రశ్నించారు. సత్వరమే ఈ సర్వే పనులను నిలుపుదల చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రమేయం తో , పారదర్శకంగా ప్రజలకు తెలియపర్చిన తరువాతనే ఎటువంటి పనైనా చేయాలని కాదని ముందుకు వెళితే చట్టపరంగా ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పెద్దలక్ష్మీపురం ప్రజలతో శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆందోళనను అర్ధంచేసుకున్నామని పై అధికారుల దృష్టి కి తీసుకు వెళదామని చెప్పి ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమం లో వైసిపి బి.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎస్.సి విభాగం కార్యదర్శి సల్ల దేవరాజు, నియోజకవర్గం యవజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్, ఇచ్ఛాపురం ఎంపిపి బోర పుష్ప, వైస్ ఎంపిపి దున్న గురుమూర్తి, ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్, బూర్జపాడు సర్పంచ్ ప్రతినిధి బుడ్డ కళ్యాణ్ కేదారిపురం ఎంపిటిసి నీలాపు జగదీష్, బూర్జపాడు మాజీ ఎంపిటిసి, మాజీ సర్పంచ్ పులకల డొంబురు, దున్న తిరుపతి, కీలు ఉమాశంకర్, పెద్ద లక్ష్మీపురం యువకులు, రైతులు మహిళలు పాల్గొన్నారు.



# ఇఫ్తార్ విందులో జిల్లా విద్యాశాఖ అధికారి

**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** శ్రీకాకుళం జి.టి రోడ్డులో గల జామియా మసీదు కు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవి బాబు ఇఫ్తార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా జామియా మసీదు అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్ మరియు కమిటీ సభ్యులు ఇస్లాం సాంప్రదాయాలతో రవిబాబును ఆహ్వానించడం జరిగింది. అనంతరం రవిబాబు ఎంతో పురాతన చరిత్ర కలిగిన జామియా మసీదును సందర్శించడం అలాగే ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొనడం తన జీవితంలో మరుపురాని సంఘటనని తెలియపరుస్తూ పరమత సహనం, క్రమశిక్షణ, తోటి వారికి సహాయపడే గుణం ఇస్లాం బోధిస్తుందని ప్రతి ముస్లిం సోదరులు అంతిమ దైవ గ్రంథం పవిత్ర ఖురాన్ అవతరించిన నెల అయినా ఈ రంజాన్ మాసంలో 30 రోజులు కఠోర ఉపవాస దీక్షతో ఉండడమే కాకుండా మహమ్మద్ ప్రవక్త చెప్పిన మార్గంలో పేదవారికి జకాత్ రూపంలో సహాయం చేయడం చాలా గొప్ప విషయాలని తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఇంత గొప్ప కట్టడం శ్రీకాకుళం నడిబొడ్డున ఉందని దీన్ని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని జామియా మసీదును ఒక పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని తద్వారా భావితరాలకు ఇస్లాం సంప్రదాయాలు చరిత్ర తెలుస్తుందని కమిటీ వారికి తెలియజేశారు. ఇటీవల రాష్ట్ర వక్ఫ్ బోర్డు నియమించిన షేక్ నిజాముద్దీన్ మరియు పది మంది సభ్యులతో కూడిన కమిటీ జామియా మసీదు అభివృద్ధిలో మసీదుకు వచ్చే వారికి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆధునికరణ, సుందరీకరణ చేయడంలో చాలా బాగా పనిచేస్తున్నారని ఈ విధంగానే ఆ భగవంతుడు ఇచ్చిన ఈ సదా అవకాశాన్ని వినియోగించుకొని మరింత మసీదు అభివృద్ధికి తోడ్పడాలని తెలుపుతూ తన వంతుగా 5,001/- రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, జామియా మసీద్ ఇమామ్ మహమ్మద్ జియాఉర్ రెహమాన్ (ముఫ్తీ), ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, తరావీహ్ ఇమామ్ మెహతాబ్ రాజా, మౌజన్ మహమ్మద్, జామియా మసీద్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎండి యాసిన్, కోశాధికారి మీర్ అసదుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ సలీం, అబ్దుల్ గఫార్ ఖాన్, సభ్యులు షేక్ శాన్ బాషా, అలీ భాయ్, ఎండి ఇబ్రహీం, ఎండి రఫీ, ఎండి. అన్వర్ బాషా, హాజీ మీర్ షాదికుల్లా, హాజీ హర్షద్, హాజీ అమీరుల్లా బేగ్, హాజీ షబ్బీర్, హాజీ ఖాన్, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## శిరస్త్రాణం ధరించండి







**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు అన్నారు. బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించిన హెల్మెట్ స్పెషల్ డ్రైవ్‌లో ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది హెల్మెట్ అవశ్యకత, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను గుర్తించి హెల్మెట్ అవసరాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా యువత ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను నివారించాలని కోరారు.

## డిగ్రీ ఫలితాలలో స్వర్ణభారతి ప్రతిభ

**ఇచ్ఛాపురం, మార్చి 11 (వార్త):** అంబేద్కర్ వర్సిటీ బుధవారం విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో స్వర్ణ భారతి డిగ్రీ కళాశాల ప్రభంజనం సృష్టించింది. రాయపూడి లత - 9.2 ( కంప్యూటర్ సైన్స్ హానర్స్) నియోజకవర్గంలో ఉత్తమ స్థానంలో నిలిచింది. కేతు. మౌనిక - 8.7, అమీషా - 8.5, శ్వేతా బెహరా - 8.5, పఠాన నికిత - 8.4 ( బోటనీ హానర్స్), వజ్రాల అంజలి - 8.3 ( కెమిస్ట్రీ హనర్స్), తెలుకల రాజేశ్వరి - 8.0 ( బీకాం హానర్స్ ) ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి అభినందించారు. కళాశాల ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఉత్తమ ఫలితాలు సాధిస్తూనే ఉన్నారని ఇలానే భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ చాట్ల మహేశ్వరి, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ చాట్ల రాము, విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ సందీప్, జయప్రకాష్, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### - నేటి నుంచి ఏప్రిల్ 1 వరకు ఆన్‌లైన్‌లో నమోదు



**జలుమూరు, మార్చి 11(వార్త):** జలుమూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యశోద బుధవారం తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించి ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 1 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపికైన విద్యార్థినుల జాబితాను ఏప్రిల్ 13న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అనాథలు, తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కులభేదం లేకుండా అన్ని వర్గాలకు చెందిన బాలికలు అర్హులని స్పష్టం చేశారు. కేజీబీవీ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన, పౌష్టికాహారంతో కూడిన భోజనం, అలాగే పాఠశాల ఆవరణలోనే సురక్షిత వసతి సౌకర్యం అందుబాటులో ఉంటాయని ప్రిన్సిపల్ యశోద తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్క ఆడపిల్ల కూడా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినులు గడువు లోపల దరఖాస్తు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆందోళన వద్దు

### - రొయ్యల రైతులు పానిక్ హార్వెస్టింగ్ చేయొద్దు
### - వదంతులను నమ్మొద్దు
### -శాస్త్రీయంగా అక్వాకల్చర్ కొనసాగించాలి
### - షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం
### - వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** గల్ఫ్ ప్రాంతంలో కొన సాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని రొయ్యల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ కో-వైస్ చైర్మన్, నాన్-అఫిషియల్ కమిటీ సభ్యులు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాలో వచ్చిన వార్తలు, మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మన దేశ సముద్ర ఆహార ఎగుమతులపై చూపే ప్రభావం గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మధ్యప్రాచ్య (గల్ఫ్) ప్రాంతంలో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా మీడియాలో వచ్చిన వార్తల వల్ల కొంతమంది ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. సముద్ర ఆహార ఎగుమతులపై ప్రభావం ఉంటుందనే భయంతో ముందస్తు లేదా పానిక్ హార్వెస్టింగ్ చేయడం సరికాదని రైతులకు సూచించారు. భారతదేశం నుండి జరిగే మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లేది కేవలం 3,4 శాతం మాత్రమేనని, అది కూడా ప్రధానంగా హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతుందని తెలిపారు. ఇతర దేశాలకు యూరోపియన్ యూనియన్, అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలకు వెళ్లే సముద్ర ఆహార కంటైనర్లు రెడ్ సీ సూయెజ్ కాలువ మార్గం, కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గం, చైనా సముద్ర మార్గం ద్వారా నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితులు భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

### అమెరికా టారిఫ్‌లతో పోటీ సామర్థ్యంపై ప్రభావం లేదు

అమెరికా మార్కెట్‌లో డిమాండ్ మార్చి నెలాఖరుకు మెరుగుపడే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా సీ ఫుడ్ ఎక్స్పో నార్త్ అమెరికా నిర్ణయం అనంతరం డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అమెరికా మార్కెట్‌లో సాధారణంగా 50, 60 కౌంట్ రొయ్యలకు మంచి డిమాండ్ ఉంటుందని, ఇవి ఆంధ్రప్రదేశ్ రైతులు సాధారణంగా ఉత్పత్తి చేసే సైజులు కావున ఆ కౌంట్ వచ్చే వరకు మధ్యస్థ పట్టుబడులు చేయనవసరం లేదన్నారు. భారతీయ రొయ్యలపై అమెరికా విధించే సుమారు 20 శాతం టారిఫ్..ఇతర పోటీ దేశాలపై ఉన్న టారిఫ్‌లతో సమానంగా ఉండటం వల్ల అంతర్జాతీయ సముద్ర ఆహార ఎగుమతి మార్కెట్‌లో భారతదేశ పోటీ సామర్థ్యం కొనసాగుతుందని మంత్రి తెలిపారు.

### షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం

ప్రస్తుతం షిప్పింగ్ కంటైనర్ల కొరత ఉందని ప్రచారం జరుగుతున్న వార్తలు అసత్యమని మంత్రి స్పష్టం చేశారు. కంటైనర్ల కొరత కారణంగా ఎగుమతులు ప్రభావితం అవుతున్న పరిస్థితి ప్రస్తుతం లేదని, అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కంటైనర్లు ఇప్పటి వరకు వెనక్కి రాలేదని తెలిపారు. ఎగుమతుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు, రైతులకు సమయానుకూల సూచనలు అందించేందుకు ప్రతి నెల చివరి వారంలో డైరెక్టర్లు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతదేశం , యూరోపియన్ యూనియన్ మధ్య కొనసాగుతున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చర్చలు పూర్తైతే భారత సముద్ర ఆహార ఎగుమతులకు మరింత మార్కెట్ అవకాశాలు లభించి భవిష్యత్తులో ఎగుమతులు పెరగడానికి దోహదపడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

### ఆక్వా రైతులు ఆందోళన చెందొద్దు

ఆక్వా రైతులు భయంతో లేదా ముందస్తు హార్వెస్టింగ్ చేయనవసరం లేదని, ఇలా చేయడం వల్ల మార్కెట్‌లో ఒకేసారి అధిక సరఫరా ఏర్పడి రొయ్యల ధరలు పడిపోవడం, రైతులకు ఆర్థిక నష్టం కలగడం జరిగే అవకాశం ఉందన్నారు. రైతులు ఎగుమతిదారులు, మత్స్యశాఖ అధికారుల సలహాలతో తమ ప్రణాళిక ప్రకారం కల్చర్ సైకిల్ పూర్తయ్యాక మాత్రమే సరైన సమయంలో హార్వెస్టింగ్ చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు , ఇతర సంబంధిత భాగస్వాములతో సమన్వయం చేస్తూ రాష్ట్రం నుండి సముద్ర ఆహార ఎగుమతులు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని రొయ్యల రైతులు నిరాధారమైన వార్తలు , వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా, శాస్త్రీయ విధానంలో అక్వాకల్చర్ కార్యకలాపాలను కొనసాగించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**పలాస, మార్చి 11 (వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల కాలంలో మృతి చెందిన వారి కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఇటీవల కాలంలో స్వర్గస్తులైన పలాస నియోజకవర్గం మున్సిపాలిటీ పరిధి ప్రముఖ వ్యాపారవేత్త " చుందూరి శ్రీరామూర్తి ", వజ్రపు కొత్తూరు మండలం నువ్వులరేవు గ్రామం కదంబాల వెంకటరమణ మాతృమూర్తి మరణించిన విషయం తెలుకొని వారి కుటుంబాలును కలిసి పరామర్శించిన పలాస ఎమ్మెల్యేగౌతు శిరీషతో పాటు ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ పీరకట్ల విఠల్, టిడిపి సీనియర్ నాయకులు టంకాల రవిశంకర్ గుప్తా, ఇతరలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కోడిపందేల నిర్వహణపై పోలీసుల దాడి

### - ఏడుగురు అదుపులోకి -నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

**నరసన్నపేట, మార్చి 11(వార్త):** లుకలాం గ్రామంలోని వంశధార నది పరివాహక ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ విషయాన్ని నరసన్నపేట ఎస్సై బి. గణేశ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పోలీసు సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు మరియు రూ.10,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు. కోడిపందేలు వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## జలుమూరు మండలంలో సోషల్ ఆడిట్‌కు సన్నాహాలు

### -రూ.29.88 కోట్ల పనులపై సమీక్ష సమావేశం



**జలుమూరు, మార్చి 11(వార్త):** జలుమూరు మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించేందుకు బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ పథకాల కింద జరిగిన పనుల వివరాలను అధికారులు వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం మండలంలో వేతనాల (ఝుస్రవ) కింద రూ.22,35,46,880, మెటీరియల్ కింద రూ.7,52,88,171 ఖర్చు చేయగా, మొత్తం రూ.29,88,35,051 వ్యయం చేసినట్లు తెలిపారు. ఈ నిధులను ప్రధానంగా పంచాయతీరాజ్, సర్వ శిక్ష అభియాన్, ఉపాధి హామీ పథకం కింద వివిధ అభివృద్ధి పనులకు వినియోగించినట్లు వివరించారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) చిన్నమ్ముడు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎస్ఆర్పీ సింహాద్రి, డీవో సెక్షన్ అధికారులు శ్రీదేవి, రాజకుమార్, అలాగే సోషల్ ఆడిట్ బృందానికి చెందిన డీఆర్పీలు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ, ఈసీ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు ఇతర సిబ్బంది సమావేశంలో హాజరయ్యారు. సోషల్ ఆడిట్ బృందం ఈ నెల మార్చి 12 నుంచి 28 వరకు మండలంలోని పలు గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఓపెన్ ఇంటర్ పరీక్షకు 755 మంది హాజరు

**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షకు 755 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గణితం, చరిత్ర, అకౌంటెన్సీ పరీక్షలగాను జిల్లా మొత్తం మీద 6 పరీక్షా కేంద్రాలను జి.భానుమూర్తి రాజు ఆధ్వర్యంలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 6 సిట్టింగ్ స్క్వాడ్‌లతో నిరంతర పర్యవేక్షణ జరిపామన్నారు. 866 మంది అభ్యర్థులకుగాను 755 మంది అభ్యర్థులు హాజరు కాగా 111 మంది గైర్హాజరయ్యారన్నారు. ఆరుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ స్క్వాడ్ అధికారుల ఆకస్మిక తనిఖీలో పట్టుబడినట్లు వెల్లడించారు.

## పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సులు

**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** ఈ నెల 16 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు.. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల నారాయణ తెలిపారు. వారి హాల్ టికెట్ చూపించి, ఈ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని వారు కోరారు.

## బయోమెడికల్ వ్యర్థాలు నిబంధనల ప్రకారమే పారవేయాలి

**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్యకలాపాలను సమీక్షించిన ఆయన మాట్లాడుతూ, నగరంలో మొత్తం 57,082 ఇళ్లలో చెత్త సేకరణ చేపడుతుండగా, అందులో 56,658 ఇళ్ల నుంచి డోర్ టు డోర్ చెత్త సేకరణ జరిగి 99.26 శాతం లక్ష్యం సాధించినట్లు వెల్లడించారు. నగరంలో రోజువారీగా 31,169 కిలోల చెత్త సేకరించినట్లు చెప్పారు. అలాగే నగరంలోని కాలువల నుంచి 0.349 కిలోమీటర్ల మేర మట్టిని తొలగించగా, దాదాపు 7 టన్నుల సిల్ట్, 5 టన్నుల చెత్త తొలగించి మొత్తం 12 టన్నుల వ్యర్థాలు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగర పరిధిలో ఉన్న అన్ని ఆసుపత్రులు బయోమెడికల్ వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో లేదా సాధారణ చెత్తతో కలిపి పారవేయరాదని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. బయోమెడికల్ వ్యర్థాలను తప్పనిసరిగా అనుమతి పొందిన అధికారిక ఏజెన్సీలకే అప్పగించాలని, నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఢిల్లీలో కూటమి ఎంపీల ఆత్మీయ కలయిక



**శ్రీకాకుళం, మార్చి 11 (వార్త):** హస్తిన పర్యటనలో ఉన్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కూటమి ఎంపీల ఆత్మీయ సమావేశంలో సందడి చేశారు. న్యూఢిల్లీ, అక్బర్ రోడ్ లోని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నివాసంలో బుధవారం మధ్యాహ్నం ఇచ్చిన విందుకు కూటమి ఎంపీలు, మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా రామ్మోహన్ నాయుడు మాతృమూర్తి లోకేష్‌ను ఆశీర్వదించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సంతానం మిహిరా, శివాన్ ఎర్రంనాయుడు లను ఎత్తుకున్న లోకేష్ వారితో సరదాగా మాట్లాడించారు. నారా లోకేష్ తన పెద్దమ్మ పురందరేశ్వరి ఆశీస్సులు తీసుకున్నారు. ఎంపీలందరినీ పేరుపేరునా పలకరిస్తూ సందడి చేశారు. ఇప్పుడు ఆ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.

## నిలిచిన ఎర్రంనాయుడు స్మారక పార్క్



**నరసన్నపేట, మార్చి 11(వార్త):** నరసన్నపేట.. ఇందిరానగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఎర్రంనాయుడు స్మారక పార్క్ పనులు నిలిచిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్క్ నిర్మాణ పనులు సుమారు రూ.2 కోట్ల నిధులతో 2014లో ప్రారంభమయ్యాయి. పార్క్ నిర్మాణం కొంతవరకు పూర్తయిన దశలో ఉండగా, 2023లో తెల్లవారుజామున కొందరు దుండగులు నిర్మాణంలో ఉన్న కొన్ని భాగాలను కూల్చివేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ఘటన తర్వాత పార్క్ పనులు నిలిచిపోయాయి. పార్క్ నిర్మాణం పూర్తయి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవ తీసుకుని పనులను తిరిగి ప్రారంభించి పార్క్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పార్క్ పూర్తయితే స్థానికులకు విశ్రాంతి, వినోదానికి అనుకూలంగా ఉండటంతో పాటు, దివంగత నాయకుడు ఎర్రంనాయుడు జ్ఞాపకాన్ని నిలబెట్టే స్థలంగా మారుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## తెలుగు సాహిత్యం-సామాజిక చైతన్యంపై చర్చ

**నరసన్నపేట, మార్చి 11(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "తెలుగు సాహిత్యం -సామాజిక చైతన్యం" అనే అంశంపై బుధవారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తగరం డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు అచ్యుతరావు సంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాట్లాడిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దాడ లత సాహిత్యం మరియు సమాజం మధ్య విడదీయరాని బంధం ఉందని పేర్కొన్నారు. సమాజంలోని సమస్యలు, విలువలు, భావజాలం సాహిత్యంలో ప్రతిబింబిస్తాయని ఆమె తెలిపారు. అధ్యాపకుడు రవికుమార్ మాట్లాడుతూ సాహిత్యం మానవుని ఆలోచనలను మలిచే శక్తి కలిగినదని, అది పరిపూర్ణ జీవితానికి బీజం వేస్తుందని అన్నారు. ఈ చర్చా వేదిక ద్వారా విద్యార్థుల్లో సాహిత్యంపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సాహిత్యం సామాజిక చైతన్యంపై చూపే ప్రభావం గురించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



# డబుల్ వీల్ మార్కర్ యంత్రాల పంపిణీ



**జలుమూరు, మార్చి 11(వార్త):** మొక్కజొన్న సాగు చేసే రైతులకు వరుసల మధ్య, విత్తనాల మధ్య సమాన దూరంలో విత్తుకోవడానికి డబుల్ వీల్ మార్కర్ యంత్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జలుమూరు మండలం సురవరం గ్రామంలో రైతులకు డబుల్ వీల్ మార్కర్ యంత్రాలను అందించే కార్యక్రమం నిర్వహించారు. వరి కోతలు పూర్తైన తరువాత నేరుగా మొక్కజొన్న సాగు చేయడానికి అనువుగా ఈ యంత్రాలను పరిసర మండలాలైన సరుబుజ్జిలి, జలుమూరు, హీరమండలం మండలాల లీడ్ ఫార్మర్స్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ టీం లీడర్ ఏ. లావణ్య మాట్లాడుతూ దున్నకుండా మొక్కజొన్న సాగు చేపట్టడం వల్ల అదనపు సాగు ఖర్చులు తగ్గడంతో పాటు సుమారు 2--3 నీటి తడులు ఆదా చేయవచ్చని తెలిపారు. గ్రామ స్థాయిలో లీడ్ ఫార్మర్స్ వద్ద డబుల్ వీల్ మార్కర్ యంత్రాలను అందుబాటులో ఉంచామని, రైతులు పరస్పర సహకారంతో వాటిని సక్రమంగా వినియోగించుకుని మొక్కజొన్న సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు రాజ్‌కుమార్, ధర్మారావు, శ్రీను, రమేష్, లక్ష్మణరావు, లీడ్ ఫార్మర్స్, రైతులు పాల్గొన్నారు.

# ప్రమాదకర స్థితిలో కల్వర్టు

### - పక్కా నిర్మాణం చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి



**నరసన్నపేట, మార్చి 11(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కల్వర్టు ప్రమాదకర స్థితికి చేరుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిగుండా ప్రతిరోజూ బ్యాంకులు, పాఠశాలలకు వెళ్లే వేలాది మంది ప్రయాణం చేస్తుండటంతో ప్రమాదాల భయం నెలకొంది. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ఈ కల్వర్టు వద్ద తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. రహదారి పరిస్థితి సరిగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుతురు సరిగా లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో పక్కాగా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అభివృద్ధికి ఆమడదూరంలో రాజుల చెరువు

### -దశాబ్దాలుగా నిలిచిపోయిన పనులు

**నరసన్నపేట, మార్చి 11(వార్త):** నరసన్నపేట పట్టణ నడిబొడ్డున ఉన్న రాజుల చెరువు అభివృద్ధి దశాబ్దాలుగా నిలిచిపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరాలు మారుతున్నా, ప్రజా ప్రతినిధులు మారుతున్నా చెరువు అభివృద్ధి మాత్రం కలగానే మిగిలిపోయిందని వారు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువు అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ పనులు ముందుకు సాగలేదని స్థానికులు తెలిపారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం కూడా అభివృద్ధి చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదని విమర్శిస్తున్నారు. దీంతో "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లు పరిస్థితి ఉందని వారు పేర్కొన్నారు. సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు గతంలో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే ముఖ్య జలవనరుగా ఉండేదని పెద్దలు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం సరైన అభివృద్ధి లేకపోవడంతో చెరువు నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువును అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546